సరైన మార్గంలో విద్యాబోధన చేయాలి



గ్రాడ్యుయేషన్‌ డే వేడుకల్లో రూపారెడ్డి

బోడుప్పల్‌: పిల్లలకు చిన్నతనం నుంచి సరైన మార్గంలో విద్యాబోధన చేయాలని బచపన్‌ స్కూల్‌ రీజనల్‌ డైరెక్టర్‌ రూపారెడ్డి అన్నారు. బుధవారం బోడుప్పల్‌ బ్రాంచ్‌లో నిర్వహించిన గ్రాడ్యుయేషన్‌ వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థుల్లో ఉత్సాహాన్ని పెంపొందిస్తాయన్నారు. విద్యార్థులు వారి తల్లిదండ్రుల సహకారంతో భవిష్యత్తుకు పునాదులు వేయగలుగుతామన్నారు. సీనియర్‌ ప్రిన్సిపాల్‌ సునీత, ప్రిన్సిపాల్‌ నీలిమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటింటా సీపీఎం నాయకుల సర్వే



సర్వే చేస్తున్న సీపీఎం నాయకులు

పోచారం: ప్రజా సమస్యలపై సీపీఎం నాయకులు బుధవారం రాజీవ్‌ గృహకల్ప కాలనీలో ఇంటింటా సర్వే నిర్వహించారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూరుతుందో లేదో అడిగి తెలుసుకున్నారు. అన్నోజిగూడలోని ఎన్‌టీపీసీ చౌరస్తా నుంచి రాజీవ్‌ గృహకల్ప కాలనీ వరకు వీధి దీపాలు, డ్రైనేజీ సదుపాయం లేదని, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరతామని నాయకులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు యాదయ్య, సబిత, అలివేలి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్‌



ఘట్‌కేసర్‌: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఘట్‌కేసర్‌ పోలీసులు బుధవారం అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్‌ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఏదులాబాద్‌లోని అండర్‌ పాస్‌ రోడ్డు సమీపంలోని ఇండియన్‌ గ్యాస్‌ ఏజన్సీ వద్ద మంగళవారం సాయంత్రం తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని సోదా చేయగా 40 గ్రాముల గంజాయి లభించింది. నిందితులను ఘట్‌కేసర్‌కు చెందిన దంతూరి రాకేశ్‌, రోహిత్‌గా గుర్తించిన పోలీసులు వారిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య..

శామీర్‌పేట్‌: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం శామీర్‌పేట పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శామీర్‌పేట పెద్దచెరువులో ఓ వ్యక్తి మృతదేహం తేలియాడుతున్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టి మృతుడిని బహదూర్‌పల్లికి చెందిన భీమనాతి రాజ శివకుమార్‌ (37) గా గుర్తించారు. ఈ నెల 8న డ్యూటీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన అతను రాత్రి ఇంటికి తిరిగి రాకపోవడంతో అదే రోజు రాత్రి అతడి భార్య లక్ష్మీ దుండిగల్‌ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా బుధవారం శామీర్‌పేట చెరువులో మృతదేహం లభ్యమైంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే అతను చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని ఎస్సై హారిక తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న బీటెక్‌ విద్యార్థి అరెస్ట్‌

పోచారం: గంజాయి విక్రయిస్తున్న బీటెక్‌ విద్యార్థిని టాస్క్‌ ఫోర్స్‌ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ఓ ఇంజినీరింగ్‌ కళాశాలలో బీటెక్‌ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రాజు గంజాయికి అలవాటు పడటమే కాకుండా బీదర్‌ నుండి గంజాయి తీసుకొచ్చి తోటి విద్యార్థులకు విక్రయిస్తున్నాడు. దీనిపై సమాచారం అందడంతో నిఘా ఏర్పాటు చేసిన ఎస్టీఎఫ్‌ పోలీసులు గంజాయి విక్రయిస్తుండగా రాజును రెడ్‌ హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 1.368 కేజీల గంజాయితో పాటు బైక్‌, సెల్‌ఫోన్‌ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని ఘట్‌కేసర్‌ ఎక్సైజ్‌ స్టేషన్‌లో అప్పగించారు.



‘పది’ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- 47,930 మంది విద్యార్థులకు 230 పరీక్షా కేంద్రాలు
- ప్రతి కేంద్రంలోనూ సీసీ కెమెరాలు
- 3,200 మంది ఇన్విజిలేటర్లు.. 15 మంది ఫ్లయింగ్‌ స్క్వాడ్‌లు.
- పరీక్షల నిర్వహణకు 567 మంది సీఎస్‌లు, డిపార్ట్‌మెంట్‌ ఆఫీసర్లు.



సాక్షి,సిటీబ్యూరో: పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. ఈ నెల 21 నుంచి వచ్చే నెల 4 వరకు జరగనున్న పరీక్షల్లో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటోంది. మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలోని 15 మండలాల పరిధిలో పరీక్షల నిర్వహణకు 230 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది 47,322 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరు కాకుండా మరో 608 మంది ప్రైవేట్‌ విద్యార్థులు కూడా పరీక్ష రాస్తున్నారు. మండలాల్లోని పరీక్ష కేంద్రాలను పరిశీలించే బాధ్యత ఎంఈవోలకు విద్యాశాఖ అప్పగించింది. ప్రహరీ, తాగునీరు, మూత్రశాలలు, వెలుతురు, విద్యుల్‌ సౌకర్యం తదితర అంశాలపై ఎంఈవోలు తనిఖీలు నిర్వహించి డీఈవోకు నివేదిక పంపిస్తున్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు సరిపడా ఫ్యాన్లు. మరుగుదొడ్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.పరీక్షా కేంద్రాల్లో 20 మంది విద్యార్థులకు ఒకరు చొప్పున 3,200 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. అలాగే 567 మంది చీఫ్‌ సూపరింటెంట్లు (సీఎస్‌),డిపార్ట్‌మెంట్‌ ఆఫీసర్లను నియమించారు. 230 పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సెంటర్ల వద్ద మెడికల్‌ టీమ్‌ ఏర్పాటు చేస్తున్నారు. మేడ్చల్‌ జిల్లాను ఎనమిది రూట్లుగా విభజించి.. ఎనమిది మంది రూట్‌ ఆఫీసర్లను నియమించారు. పరీక్షల్లో మాస్‌ కాపీయింగ్‌ జరగకుండా 15 మంది ఫ్లయింగ్‌ స్క్వాడ్‌లను నియమించటంతోపాటు కేంద్రాల సంఖ్యకు అనుగుణంగా సిట్టింగ్‌ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రాలను ప్రతిరోజూ సీసీ కెమెరాల నిఘాలో ఉంచనున్నారు. ఇందుకు గానూ అవసరమైన చర్యలు చేపట్టారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం:
పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ అమలు చేసింది. మూడు నెలల ముందు నుంచే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేకంగా అదనపు తరగతుల నిర్వహణతోపాటు సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధను కనబరిచింది. ఇంటి వద్ద విద్యార్థులు చదువుకునేలా ఉదయం ,సాయంత్రం వేళల్లో వారిని మానిటరింగ్‌ చేసేందుకు ప్రత్యేకంగా ఉపాధ్యాయులను నియమించారు.

విద్యార్థులకు ఇబ్బంది కలుగనివ్వం



మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పరీక్షా కేంద్రాల గుర్తింపు, సిబ్బంది ఏర్పాట్లు పూర్తయ్యాయి. కేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాం. పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం.

–ఐ.విజయకుమారి, విద్యాశాఖ అధికారి ,మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా

నందనవనం పార్కు కబ్జాకు యత్నం



పార్కులో పరికరాలను తొలగిస్తున్న బౌన్సర్లు

జవహర్‌నగర్‌: జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌ పరిధిలోని 15వ డివిజన్‌ ఆనంద్‌నగర్‌ కాలనీలోని నందనవనం పార్కును కబ్జా చేసేందుకు బుధవారం కొందరు వ్యక్తులు ప్రయత్నించారు. 20 మంది బౌన్సర్లు, కిరాయి మనుషులతో వచ్చిన వారు పార్కు బోర్డును తొలగించి, జిమ్‌ పరికరాలు, ఇతర వస్తువులు ధ్వంసం చేశారు. ఈ విషయం తెలుసుకున్న కాలనీవాసులు బౌన్సర్లను అడ్డుకోగా బౌన్సర్లు తిరగబడ్డారు. దీంతో పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. పార్కును కబ్జా చేయడానికి చూస్తే ఊరుకోబోమని, మరోసారి పోరాటానికి సిద్ధమవుతాయని కాలనీవాసులు హెచ్చరించారు. పార్కును ఆక్రమించాలని చూస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. నందనవనం పార్కును ధ్వంసం చేసిన వారిపై జవహర్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు కమిషనర్‌ వసంత తెలిపారు.

తుమ్మచెరువు కట్టపై బారికేడ్లు ఏర్పాటు చేయాలి

మేడ్చల్‌: తుమ్మ చెరువు కట్ట మీదుగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నందున కట్ట దెబ్బతినడంతో పాటు సీసీ రోడ్డు ధ్వంసమవుతోందని మాజీ వార్డు సభ్యుడు రవిందర్‌ అన్నారు. తుమ్మ చెరువు కట్టపై బారికేడ్లు ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం ఆయన కమిషనర్‌ నాగిరెడ్డి కి వినతి పత్రం అందజేశారు. కట్టను వెడల్పు చేసి సీసీ రోడ్డు నిర్మించిన సమయంలోనే కట్టపై నుంచి భారీ వాహనాలు వెళ్లకుండా ఇరు వైపులా బారికేడ్లు ఏర్పాటు చేశారన్నారు. ఇటీవల అధికారులు వాటిని తొలగించడంతో కట్టపై భారీ వాహనాలు తిరుగుతూ అందరికి ఇబ్బందులు కలగజేస్తున్నాయని అన్నారు. కట్ట ,కట్టపై ఉన్న రోడ్డు దెబ్బతినకుండా తిరిగి బారికేడ్లు ఏర్పాటు చేయాలని కోరారు.



క్రీడలతో మైత్రీ భావం పెంపొందుతుంది



మాట్లాడుతున్న స్పోర్ట్స్‌ కౌన్సిల్‌ సెక్రటరీ దిలీప్‌

ఘట్‌కేసర్‌: క్రీడలు మైత్రీ భావాన్ని పెంపొందిస్తాయని జేఎన్టీయూహెచ్‌ ఫిజికల్‌ ఎడ్యుకేషన్‌ ప్రొఫెసర్‌, స్పోర్ట్స్‌ కౌన్సిల్‌ సెక్రటరీ డాక్టర్‌ ఎస్‌ఎస్‌ దిలీప్‌ అన్నారు. బుధవారం ఘనాపూర్‌ కొమ్మూరి ప్రతాపరెడ్డి ఇంజినీరింగ్‌ కళాశాల (కేపీఆర్‌ఐటీ)లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ స్థాయి క్రీడా ఉత్సవం ‘‘కురుక్షేత్ర– 25’’ను ఆయన కళాశాల చైర్మన్‌ కొమ్మూరి ప్రతాపరెడ్డి, వైస్‌ చైర్మన్‌ ప్రశాంత్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.ఈ పోటీల్లో పలు రాష్ట్రాలకు చెందిన 120కు పైగా జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో కేపీఆర్‌ఐటీ డైరెక్టర్‌ సుధీర్‌ప్రేమ్‌ కుమార్‌, ప్రిన్సిపల్‌లు రవీంద్ర ఏళ్లార్కర్‌, శ్రీనివాస్‌రెడ్డి, ఫిజికల్‌ డైరెక్టర్లు రంజిత్‌, లివిజా రాణి, సంజీవులు, స్పోర్ట్స్‌ కోఆర్డినేటర్లు, క్రీడాకారులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మేడ్చల్‌: మున్నూరుకాపు మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మున్నూరు కాపు సంఘం నాయకుడు పురుషోత్తం అన్నాడు. బుధవారం అత్వెల్లిలో నిర్వహించిన జిల్లా మున్నూరు కాపు మహిళా పరస్పర సహాయ వినియోగదారుల సహకార సంఘం లిమిటెడ్‌ సంస్థ డైరెక్టర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్నూరు కాపు మహిళలు అన్ని రంగాల్లో అభ్యున్నతి సాధించేందుకు సంస్థ ఏర్పాటు చేశామని మహిళలందరూ సంఘంలో చేరి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో మున్నూరు కాపు మహిళ సంఘ నాయకురాళ్ళు అరుణ, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న డైరెక్టర్లు

చోరీ కేసులో నిందితుల అరెస్ట్‌

కీసర: తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీకి పాల్పడిన కేసులో కీసర పోలీసులు నిందితులను అరెస్ట్‌ చేశారు. బుధవారం కీసర సీఐ శ్రీనివాస్‌, ఎస్‌ఐ నాగరాజు వివరాలు వెల్లడించారు. నాగారం పాత గ్రామానికి చెందిన కొప్పుల ప్రదీప్‌ కుమార్‌ ఈనెల 8న రాత్రి ఇంటికి తాళం వేసి తన కుటుంబ సభ్యులతో కలిసి గుడికి వెళ్లాడు. మర్నాడు ఇంటికి వచ్చే సరికి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగుల గొట్టి అల్మారాలో దాచిన 16 తులాల బంగారం, 45 తులాల వెండి ఆభరణాలు రూ.20 వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈనెల 11న రాంపల్లి చౌరస్తాలో తనిఖీలు చేస్తుండగా సమీపంలోని నగల దుకాణం వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని సోదా చేయగా బంగారు ఆభరణాలను గుర్తించారు. స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా నేరం అంగీకరించాడు. పాత నేరస్తుడు రాంపల్లికి చెందిన నూతక్కి అవినాష్‌ తోపాటు, చింతల్‌కు చెందిన చెల్లపల్లి కోటేశ్వర రావును అరెస్ట్‌ చేసిన పోలీసులు వారి నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

మిలిటరీ కాలేజీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి,సిటీబ్యూరో: రాష్ట్రీయ ఇండియన్‌ మిలిటరీ కాలేజీ (ఆర్‌ఐఎంసీ) డెహ్రాడూన్‌ (ఉత్తరఖండ్‌)లో 8వ తరగతిలో ప్రవేశానికిగాను తెలంగాణ ప్రాంత విద్యార్థులకు జూన్‌ 1న యస్‌సీఆర్‌టీ డైరెక్టర్‌ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించిన నోటిఫికేషన్‌ విడుదల చేశారన్నారు. అభ్యర్థులు ఆర్‌ఐఎంసీ వెబ్‌సైట్‌ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్‌ చేసుకుని పూర్తి చేసిన అప్లికేషన్‌ ఫారంను రెండు ప్రతులలో ఎస్‌సీఈఆర్‌టీ కార్యాలయంలో ఈ నెల31వరకు సమర్పించాన్నారు. అభ్యర్థులు దరఖాస్తు ఫారాలను కేవలం డైరెక్టర్‌ ఎస్‌సీఈఆర్‌టీ, ఎల్‌బీ స్టేడియం ఎదురుగా ‘ఈ’ గేట్‌, బషీర్‌బాగ్‌, హైదరాబాద్‌లో మాత్రమే గడువు లోపు అందజేయాలన్నారు.



సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్‌– మల్కాజిరి జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం మేడ్చల్‌ కలెక్టరేట్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్‌(రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి ,డీఆర్‌ఓ హరిప్రియ, లా ఆఫీసర్‌ చంద్రావతి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత పాల్గొన్నారు. వివిధ రంగాల్లో మహిళలు ఎదుగుతున్న తీరు, వారి గొప్పతనాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. జిల్లాలోని వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మహిళా ఉద్యోగులను సత్కరించారు. కార్యక్రమంలో అధికారులు శోభారాణి, డాక్టర్‌ శ్రీదేవి, అర్చన, శార ద, రేణుక, స్వాతి, అంగన్వాడీ కేంద్రాల సూపర్‌వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, చైల్డ్‌ ప్రొటెక్షన్‌ యూనిట్‌ సభ్యులు సరిత, శ్వేత పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ కల్యాణం

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలో పెద్దమ్మ తల్లి కల్యాణ మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ముదిరాజ్‌ సంఘం, గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారి కల్యాణం నిర్వహించారు. అనంతరం అగ్నిగుండాలు, మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు మల్లిఖార్జున్‌ ముదిరాజ్‌, పెంటయ్య, మాజీ సర్పంచ్‌ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బాల నర్సింహ్మా, క్రిష్టారెడ్డి, నూరి, అరుణ్‌, రమేశ్‌,శ్రీనివాస్‌, గ్రామస్తులు పాల్గొన్నారు. –మేడ్చల్‌రూరల్‌



పెద్దమ్మ తల్లిని దర్శించుకుంటున్న నాయకులు

అగ్నిగుండం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



ఘనంగా పెద్దమ్మతల్లి జాతర



శామీర్‌పేట్‌: తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని శామీర్‌పేటలో పెద్దమ్మతల్లి జాతర ఉత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మాజీ మంత్రి, మేడ్చల్‌ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి జాతరలో గ్రామస్తులు, మహిళలు, స్థానిక నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నా భర్త చావుకు కారణమైన వారిని శిక్షించాలి

శామీర్‌పేటకు చెందిన దివ్యాంగురాలు శ్రీలత



పంజగుట్ట: ‘నా భర్త చావుకు కారణమైన నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలి’అని శామీర్‌పేటకు చెందిన దివ్యాంగురాలు శ్రీలత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. తన భర్తను హత్య చేశారని కాని పోలీసులు విద్యుదాఘాతంతో చనిపోయాడని చెబుతున్నారని ఆరోపించింది. ఇది హత్యే అని అన్ని ఆధారాలు చూపినా పోలీస్‌ ఉన్నతాధికారులను కలిసినా, కలెక్టర్‌ను కలిసినా ఫలితం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.

- బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితురాలు శ్రీలత మాట్లాడుతూ తన భర్త బాలరాజుకు ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఉన్నారన్నారు. మామ గోపాల్‌ తన భర్తకు, తనకు తెలియకుండా మేడ్చల్‌లో ఆయన పేరున ఉన్న భూమిని ఆడబిడ్డల పేరుపై రిజిస్ట్రేషన్‌ చేశాడని తెలిపింది. ఇది తెలిసిన తన భర్త వారి వద్దకు వెళ్లి తనకు తెలియకుండా ఎలా రిజిస్ట్రేషన్‌ చేసుకుంటారని ప్రశ్నించగా, తన ఆడపడుచులు, వారి భర్తలు తన భర్తను విచక్షణారహితంగా కొట్టారని, అదే రోజు దూలపల్లి పార్క్‌ వద్ద దాడి చేయించారని ఆరోపించింది. కుటుంబ సమస్య అని పోలీసులకు ఫిర్యాదు కూడా చెయ్యలేదన్నారు.
- 2023 సెప్టెంబర్‌ 14వ తేదీన రాత్రి 10.30గంటలకు తనకు తన భర్త బాలరాజు ఫోన్‌ చేసి పొలంవద్ద నీళ్లు పెడుతుంటే అక్కడ ఎవరో కరెంట్‌ షాక్‌ పెట్టారని తెలిపాడన్నారు. మాస్కులు ధరించిన ముగ్గురు వ్యక్తులు షాక్‌ కొట్టిన తననే కొట్టి పొలం నుంచి దూరం తీసుకెళ్లి అక్కడ పడేశారని వీడియో కాల్‌ చేసి చెప్పాడని తెలిపింది. అప్పుడు తాను డెలివరీకి అని తన పుట్టింటికి వెళ్లానని దీంతో తాను గ్రామ సర్పంచ్‌కు, పోలీసులకు సమాచారం ఇచ్చానన్నారు. పోలీసులు తన భర్త స్టేట్‌మెంట్‌ కూడా రికార్డు చేసుకున్నారని, మెజిస్ట్రేట్‌ కూడా మరణ వాఙ్మూలం తీసుకున్నాడని, అదే నెల 29 న తన భర్త చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపింది. తర్వాత కేసును పోలీసులను పట్టించుకోవడం లేదని తాను పోలీసు ఉన్నతాధికారులను, కలెక్టర్‌ను కలిసి విన్నవించుకున్నా తనకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు కరెంటు షాక్‌తో చనిపోయాడని అంటున్నారని పొలంలో షాక్‌ కొడితే రెండు కిలోమీటర్ల దూరంలో ఒక వెంచర్‌లో ఎలా పడి ఉంటాడని ప్రశ్నించింది. అతని శరీరంపై కరెంట్‌ షాక్‌ కొట్టిన ఆనవాళ్లు లేవని, ఎవరో ఉద్దేశపూర్వకంగా కాల్చినట్లు ఉన్నాయని తెలిపారు. తనకు న్యాయం చేయాలని, తన భర్తను హత్య చేసిన వారిని గుర్తించి వారికి కఠినంగా శిక్షించాలని, తన భర్తకు రావాల్సిన పొలం తనకు ఇప్పించాలని విజ్ఞప్తి చేసింది.

వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

జవహర్‌నగర్‌: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే వరకు గ్రూప్స్‌ ఫలితాలను విడుదల చేయరాదని కోరుతూ జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌ అంబేడ్కర్‌ ప్రధాన చౌరస్తా వద్ద బుధవారం ఎమ్మార్పీఎస్‌ మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డెపల్లి శివకుమార్‌ మాదిగ ఆధ్వర్యంలో నిరవధిక దీక్ష చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంజేఎఫ్‌ జాతీయ ఇన్‌చార్జీ తిప్పారపు లక్ష్మణ్‌ మాదిగ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేంత వరకు గ్రూప్స్‌ ఫలితాలను విడుదల చేయరాదని, లేని పక్షంలో సీఎం రేవంత్‌రెడ్డికి మాదిగ సమాజం తగిన గుణపాఠం చెబుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంచందర్‌, జాన్‌, వెంకటేష్‌, ఆనంద్‌, ఆశయ్య, స్వామి, కొమురయ్య, యాదగిరి, నర్సింహులు పాల్గొన్నారు.



ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ర్యాలీ

ఉప్పల్‌: అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. భగత్‌సింగ్‌ పోరాట పటిమ, రాజ్‌గురు సుఖ్‌దేవ్‌ లాంటి అమరుల త్యాగాలు, వారి విప్లవాత్మక భావజాలాన్ని గుర్తు చేసుకునేందుకు బుధవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ర్యాలీకి ముఖ్యఅతిథిగా హాజరైన మేడ్చల్‌ జిల్లా ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్షుడు అవినాష్‌ జిల్లా కార్యదర్శి తదితరులు మాట్లాడుతూ.. అమరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల హక్కులు, నాణ్యమైన విద్య అందుబాటులోకి రావడానికి, అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడే శక్తిని ఇవ్వాలని వారిని స్మరించుకున్నట్లు పేర్కొన్నారు.